క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామినేని



కంకిపాడు: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు పట్టణానికి చెందిన రామినేని రమాదేవి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రమాదేవిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమాదేవి బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా రమాదేవి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహిళా వర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన వాటర్ పైప్‌లైన్, మోటారు బోర్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు, 15 మోటారు బోర్ల సాయంతో తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో కాల్వగట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని, వాటర్ పైప్‌లైన్ లీక్‌లు గుర్తించి మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: ఉంగుటూరు మండలం తేలప్రోలు సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 7.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ డివిజన్ ఈఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండారుగూడెం, సీతారాంపురం, నారా అప్పారావుపేట, తేలప్రోలు, ఆత్కూరు, పెద అవుటపల్లి, పొట్టిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గన్నవరం రూరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో మదుపల్లి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్య విద్య చదువుతున్న బొకినాల గీతికకు రామకృష్ణమూర్తి రూ.5 వేలు, సయ్యద్‌లాల్ రూ. 2వేలు, కర్రా వరప్రసాద్ రూ. 2వేలు అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మున్నీసాకు రూ. 5వేలు అందజేశారు. నెక్కలపూడి ఈశ్వరరరావు ఆర్థిక సహకారంతో రూ. 29వేలు కొల్లూరి మరియమ్మకు కృత్రిమ కాలు వేసేందుకు అందజేశారు. ఉపాధ్యక్షుడు కేఎస్ జగదీశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, ప్రతినిధులు గన్నె వెంకట్రావు, సయ్యద్ లాల్, ముక్కామల సుబ్బారావు, రామకృష్ణరావు, కృష్ణమోహన్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, చక్రవర్తుల రఘు తదితరులు పాల్గొన్నారు.

నున్నలో గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని పంచాయతీ గ్రంథాలయాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకొనే విధంగా పునరుద్ధరించాలని ఏఎంసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను కోరారు. గ్రంథాలయంలో సదుపాయాలను కల్పించి పాఠకులకు అందుబాటులో తీసుకురావాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

దేశ సమగ్రతకు ప్రజలంతా కలిసిమెలసి ఉండాలి

పెనమలూరు: దేశ సమగ్రత, సమైక్యత, మత సామరస్యం కోసం ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు అన్నారు. యనమలకుదురు గ్రామంలో ఆదివారం రాత్రి సమైక్యత సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కశ్మీర్‌లో సామాన్య ప్రజలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి చంపడం దారుణమన్నారు. మండల సీపీఎం కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల హామీలు మరిచి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మహిళలపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఏకే బాషా, నేతలు కర్రా ఆదిశేషారావు, పీ పాతాలక్ష్మి, షేక్ మస్తాన్‌వలి, చిన పాపారావు, వాటపల్లి శ్రీరాములు, మేకల శ్రీను, సత్యం, షేక్ బాబు, మాధవరావు, నాగమణి పాల్గొన్నారు.

అంబాపురంలో పడకేసిన పారిశుద్ధ్యం

- చినుకు పడితే రోడ్లపైనే వర్షం నీరు
- డ్రైయినేజీ కాలువల్లో కదలని మురుగునీరు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విజయవాడరూరల్: అంబాపురం గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పైపులరోడ్డు సమీపంలోని అంబాపురంలో ఎక్కడ చూసిన రోడ్లపై పడిన గుంతల్లో వర్షం నీరు నిలబడి ఉంటున్నాయి. డ్రైయినేజీ కాలువల్లో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమల బెడద అధికమై స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పలు దఫాలు ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శిస్తున్నారు.

కనీస వసతులు కరువు

జక్కంపూడి జంక్షన్ నుంచి పైపులరోడ్డు వరకు దాదాపు 30 వరకు అడ్డరోడ్లు కలిగి ఉండి 3,500 మంది జనాభా నివసిస్తున్నారు. విజయవాడ నుంచి అంబాపురం గ్రామానికి వచ్చి గృహాలు నిర్మించుకొని నివసించే కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ ప్రాంతం విజయవాడ నగరంలో కలిసిపోయినట్లుగా కనిపిస్తుంది. అయితే మౌలిక సదుపాయాల విషయానికి వస్తే మచ్చుకైనా కనిపించవు. పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. కనీసం రోడ్లు, డ్రైయినేజీ కాలువలు లేవు. మంచినీటి సదుపాయం కూడా లేకపోవడంతో ప్రైవేటు ఆర్వో ప్లాంటు నుంచి తాగునీరు కొనుగోలు చేస్తున్నారు. జ్వరం వస్తే మందు బిళ్ల దొరికే ప్రభుత్వ ఆసుపత్రి సదుపాయం కూడా లేదు.



రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షం నీరు

పందులు స్వైర విహారం

గ్రామంలోని ఐదవ అడ్డరోడ్డులో పందులు స్వైరవిహారం చేస్తూ స్థానికులను భయపెడుతున్నాయి. మురుగుకాలువల్లో ఆహారం కోసం వచ్చే పందులు ఇళ్లల్లోకి సైతం వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి నుంచి పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని భయపడుతున్నారు. అలాగే వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని వర్షాలు కురవడంతో పాముల భయం వెంటాడుతోందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య సిబ్బంది చే మురుగుకాలువలు శుభ్రం చేయించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు పంచాయతీ, మండల పరిషత్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంబాపురం గ్రామంలో ఇళ్ల మధ్య సంచరిస్తున్న పందులు

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



అంబాపురంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలి. వర్షాకాలంలో వర్షంనీరు ఎక్కడబడితే అక్కడ నిలిచి ఉంటోంది. దీంతో దోమల బెడద ఎక్కువై వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– కందలగడ్డ సాయికుమార్, అంబాపురం

పందులతో భయం



పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులు సంచరించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇళ్లల్లోకి వస్తున్నాయి. వాటి వల్ల అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– పల్ల సతీష్, అంబాపురం

పారిశుద్ధ్య చర్యలు చేపడతాం



గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. డ్రైయినేజీ కాలువల నిర్మాణం విషయం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

– డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

అకాల వర్షంతో అవస్థలు



ఆరబెట్టిన మొక్కజొన్న



పసుపు కొమ్ములను ఎండబెడుతున్న కూలీలు



ఎండ రావడంతో పరదాలు తీసి ఉంచిన పసుపు రాశి

అకాల వర్షాలు రైతులకు అదనపు కష్టాలు తెచ్చిపెట్టాయి. చేతికొచ్చిన పంటను ఆరబెట్టి, ఎండబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమైన తరుణంలో భారీ వర్షాలు చుట్టుముట్టాయి. వర్షానికి పరదాల మాటున భద్రపరిచిన పసుపు కొమ్ములు, మొక్కజొన్న పంటలు తడిచి ముద్దవుతున్నాయి. ఎక్కడ చూసినా పొలాలు, ఖాళీ వెంచర్లలో పసుపు కొమ్ములు, మొక్కజొన్న గింజలను ఎండబెట్టే పనుల్లోనే రైతులు, కూలీలు కనిపిస్తున్నారు. గొడవర్రు గ్రామంలో సోమవారం కనిపించిన దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

– కంకిపాడు

ఆటల పోటీలతో మానసిక ఉల్లాసం

గన్నవరం రూరల్: ఆటల పోటీలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కే కృపానందం పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. అలాగే ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కే జ్యోతి కుమారి విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలను అభినందించారు. సిబ్బంది పాల్గొన్నారు.



పురుషోత్తపట్నంలో లెమన్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారిణి భారతి సూచించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా వణుకూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలకు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో తోక కథలు చెప్పించి, ఆటపాటలు నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కంకిపాడు: యోగాసనాలతో మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ అలవడుతాయని వక్తలు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా సోమవారం తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు యోగాసనాలు సాధన చేశారు. పుస్తకాలు, పేపర్లు పఠించడంలో శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. అలాగే కంకిపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను రిటైర్డు ఉద్యోగి పోలవరపు ప్రభాకర్ విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆటపాటల పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.



వణుకూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో యోగాసనాలు సాధన చేస్తున్న చిన్నారులు

యోగాతో ఆరోగ్యం

పెనమలూరు: యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పీ భవానీప్రసాద్ పేర్కొన్నారు. పోరంకిలో సోమవారం సచివాలయం-3లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరు పాల్గొనాలని కోరారు. యోగా చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆక్యుపంక్చర్ వైద్యుడు మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగాతోనే ఆరోగ్యంగా జీవించగలుగుతామని చెప్పారు. అనంతరం సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.



సబ్సిడీపై వరి విత్తనాలు

గన్నవరం రూరల్: ఉంగుటూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనం ఎంటీయూ-1318 సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సోమవారం తెలిపారు. కేజీ విత్తనానికి రూ. 5 సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు సన్నద్ధం చేశామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం అర్హుల ఎంపిక 95శాతం పూర్తి అయినట్లు తెలిపారు. రైతులకు సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



మానికొండలో విత్తనాలను రైతులకు అందజేస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

వ్యక్తిపై హత్యాయత్నం

పెనమలూరు: యనమలకుదురులో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి హత్యాయత్నం చేయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా బద్రి గ్రామానికి చెందిన బగ్గు శ్రీనివాసరావు యనమలకుదురు డొంకరోడ్డులోని సాయిరామ్ ఎస్టేట్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను విజయవాడలో బంగారం పనులు చేస్తాడు. కాగా శ్రీనివాసరావు బంధువు జానకిరామ్ ఇటీవల శ్రీనివాసరావు భార్య ఫొటోలు ఫోన్‌లో పలువురికి పంపాడు. ఈ విషయమై జానకిరామ్‌ను శ్రీనివాసరావు, అతని భార్య తీవ్రంగా మందలించారు. కాగా కుటుంబ సభ్యులతో ఊరు వెళ్లిన శ్రీనివాసరావు ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. అయితే అప్పటికే ఇంటి వద్ద కాపుకాసిన జానకిరామ్ రాడ్‌తో శ్రీనివాసరావు తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి ప్రాణ భయంతో శ్రీనివాసరావు పారిపోయి స్థానికులు సాయంతో ఆస్పత్రిలో చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అస్తవ్యస్తంగా పనులు.. ప్రజలకు అవస్థలు

- ప్రత్యామ్నాయ మార్గం లేక రాకపోకలకు ఇబ్బందులు
- నత్తనడకన సాగుతున్న పనులు
- రోడ్డు విస్తరణలో తొలగించని విద్యుత్ స్తంభాలు



పూర్తికాని డ్రైయినేజీ కల్వర్టు నిర్మాణ పనులు

కంకిపాడు: తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి అన్నట్లు ఉంది పాలకుల పరిస్థితి. రోడ్డు అభివృద్ధి చేస్తున్నాం .. మీ చావు మీరు చావండి అన్నట్లు ఉంది. అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా సాగుతుండటంతో రాకపోకలు సజావుగా సాగక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో సమస్య తీవ్రమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాల్లోకి వెళితే... మండల కేంద్రమైన కంకిపాడు పట్టణంలో ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు మార్జిన్‌లలో బరంతులు లేక, పగుళ్ల వారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ నిధులు రూ. 22 లక్షలు అంచనా వ్యయంతో ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి అభివృద్ధి పనులను చేపట్టారు. కాలనీలోని వాటర్ ట్యాంకు వరకు ఉన్న సిమెంట్ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రోడ్డు తొలగించి కంకరు మిక్స్ రోడ్డుపై పరిచారు. దీనిలో భాగంగానే రెండు చోట్ల డ్రైయినేజీ మురుగు పోయేందుకు వీలుగా ప్రధాన రోడ్డు మార్గాన్ని తవ్వేసి కల్వర్టులు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు.

ముందుకు సాగని పనులు

అయితే పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీనికి తోడు వర్షాలు కూడా తోడవ్వటంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. రోడ్డును తవ్వేసి కందకాలుగా వదిలేయడంతో ఎస్సీ కాలనీ వాసులు ప్రధాన గ్రామంలోకి చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆఖరికి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే ఆస్కారం లేదు. రోజుల తరబడి పనులు సాగుతుండటంతో ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని అందుబాటులోకి తేకుండా పనులు చేపట్టడం అనాలోచిత చర్యే అవుతుందని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి సమీపంలో పుల్లేరు కాలువ కట్ట ప్రత్యామ్నాయ రోడ్డు మార్గంకు అనువుగా ఉందని, ఆ మార్గాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండవని స్థానికులు చెబుతున్నారు.

ఇదెక్కడి చోద్యం

రోడ్డు అభివృద్ధితో పాటు చేపట్టిన విస్తరణ పనులను చూసి అంతా ముక్కున వేలు వేసుకుంటున్నారు. విస్తరణ పనులు చేపట్టిన ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా కంకరు మిక్స్ సరిచేశారు. స్తంభాలను తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టినా ప్రయోజనం ఏముంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణ ప్రదేశంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంతో పాటుగా ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి తెస్తేనే ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

వర్షాలతో ఇబ్బందులు

వర్షాలతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించాలని సూచించాం. – రాజేష్, పీఆర్ ఏఈ, ఇన్‌చార్జి, కంకిపాడు



కంకిపాడు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు మార్గం



రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు



ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్లక్ష్యంగా వదిలేసిన దృశ్యం

వాటర్ ట్యాంక్ నిర్మించాలి

విజయవాడరూరల్: అంబాపురం గ్రామం(పైపులరోడ్డు)లో వాటర్ ట్యాంక్ నిర్మించాలని నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో జల జీవన్ మిషన్ ద్వారా పైపులరోడ్డు వద్ద అంబాపురం గ్రామంలో లక్షా 25వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం తలపెట్టి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయిందని తెలిపారు. అధికారులు స్పందించి వాటర్ నిర్మించడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

నేడు యోగాంధ్ర ర్యాలీ

కంకిపాడు: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు కంకిపాడు పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బసవయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు, అక్కడి నుంచి అయానా కన్వెన్షన్ సెంటరు వరకు ర్యాలీ సాగుతుందన్నారు. అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దాసాంజనేయస్వామికి మండల పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో కృష్ణా మిల్క్ యూనియన్‌కు చెందిన ప్రాజెక్టు కామధేను పాల ఉత్పత్తుల కార్మాగారం ప్రాంగణంలోని సీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తి కావడంతో సోమవారం మండల పూజలు, అభిషేకాలు వైభవంగా జరిగాయి. మహిళా భక్తుల భజన సంకీర్తనలు, కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎంపీ కొల్లి ఈశ్వరబాబు పాల్గొన్నారు.